క్లుప్తంగా

శిశుగృహ సందర్శన



ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ విజయ

మద్రిపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల(సీసీఐ)ను స్కీమ్స్ అధికారులు సందర్శించారు. అందులో భాగంగానే సోమవారం 53వ వార్డు మద్రిపాలెంలోని మహిళా శిశుగృహ కేంద్రం, మహిళా హాస్టల్‌ను సోమవారం స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ ఎ.విజయ సందర్శించారు. శిశుగృహ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వారి సంరక్షణ కోసం ఆరా తీశారు. పలు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రమణకుమారి, నోడల్ అధికారి శ్రీకళ, డీసీపీవో లక్ష్మి, పీవో(ఎన్ఐసీ) మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధిలోని గౌరీపరమేశ్వరుల ఆలయ 10వ వార్షికోత్సవం సోమవారం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాజు, వీర్రాజు, లక్ష్మి, కుమారి, ప్రశాంత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

జామ్ ఎంట్రన్స్‌లో కృష్ణా కాలేజీ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ఐఐటీ జామ్ ఎంట్రన్స్ పరీక్షలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో రాజ్‌గిరి బంగారి, ఐఐటీ మద్రాస్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఎం.హేమలత సీట్లు దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ.వి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆంధ్రా యూనివర్సిటీలో పోలీసుల బందోబస్తు



ఉత్తర నియోజకవర్గ వ్యూ.. (కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి)

వీడనున్న ఉత్కంఠ..!

- నేడే ఎన్నికల ఫలితాల విడుదల
- విజయం మాదేనని ప్రధాన పార్టీల అభ్యర్థుల ధీమా
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓటర్లు



సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పదవి ఎవరిని వరించనుందో తేలే రోజు రానే వచ్చింది. మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. మే 13న ఎన్నికల ఓటింగ్ ముగిసిన నాటి నుంచి నేటి వరకు గెలుపెవరిదన్న ఉత్కంఠతో ఓటర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జూన్ 4వ తేదీ ఎప్పుడు వస్తుందా.. ఫలితాలు ఎప్పుడు వస్తాయి.. విజయం ఎవరిని వరిస్తుంది.. మన పార్టీ అభ్యర్థి గెలుస్తాడా లేదా అని నరాలు తెగే ఉత్కంఠతో ప్రజలు, ఓట్లు, నాయకులు ఎదురు చూస్తున్నారు.

వీరి మధ్యే పోటీ

ఉత్తర నియోజకవర్గ శాసనసభ బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. వైఎస్సార్‌సీపీ నుంచి కె.కె.రాజు బరిలో ఉండగా.. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నుంచి బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు పోటీ పడుతున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత విజయంపై ప్రత్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేశారు. ఆయా పార్టీల మద్దతుదారులు గెలుపు మాదంటే మాదని జోరుగా బెట్టింగులు కట్టినట్టు తెలుస్తోంది.

20 రౌండ్లలో లెక్కింపు

ఉత్తర నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల కొత్త భవనంలో ఏర్పాటు చేశారు. నాలుగు గదులను కేటాయించగా, వాటిలో ఒక గదిలో పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనున్నారు. మరో మూడు గదుల్లో ఈవీఎంలలో నమోదైన ఓట్లు లెక్కిస్తారు. ఉత్తరలోని 275 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు నిక్షిప్తమైన ఈవీఎంలను తెరవడానికి 14 బెంచీలు ఏర్పాటు చేశారు. 275 ఈవీఎంలను 20 రౌండ్లలో లెక్కించనున్నారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు వెలువడే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

మహిళల ఓట్లే కీలకం

నియోజకవర్గంలో మొత్తం 2,85,789 మంది ఓటర్లు ఉండగా.. 1,84,703 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారిలో పురుషులు 90,124 మంది, మహిళలు 94,566 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. పురుషుల కంటే 4,442 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపు విషయంలో మహిళల ఓటింగ్ కీలకంగా మారనుంది. వారి ఓట్లు ఎవరి పక్షాన నిలవనున్నాయి, గెలుపు ఎవరిని వరించనుంది, ఉత్తర ఓటర్లు ఎవరికి పట్టం కట్టనున్నారో మరికొన్ని గంటల్లో ఫలితం తేలనుంది.

ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది మద్దిలపాలెం కూడలి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆర్చి నుంచి వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వైపు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అడుగడుగునా పోలీస్ పహారా



బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద పోలీస్ బందోబస్తు



సీతంపేట మెయిన్ రోడ్డులో స్పెషల్ ఫోర్స్‌తో సీఐ రమేష్

- ఎమ్మెల్యే అభ్యర్థుల నివాసాలు, కార్యాలయాల వద్ద భారీ బందోబస్తు
- 150 మంది బైండోవర్
- నింబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థుల పార్టీ కార్యాలయాలు, నివాసాల వద్ద ద్వారకా, ఫోర్త్‌టౌన్‌ల సీఐలు ఎస్.రమేష్, ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ వేళ ఎటువంటి అల్లర్లు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు డీసీపీ–1 లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏసీపీలు జయరాంప్రసాద్, రాంబాబు నేతృత్వంలో ముందస్తు చర్యలు చేపట్టారు. 15 రోజులుగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పికెట్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపొందిన రాజకీయ పార్టీ అభ్యర్థి ర్యాలీలు, సభలు నిర్వహించరాదని పోలీసులు సూచించారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో ఇరు పార్టీల వారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కామెంట్లు చేయరాదన్నారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉంటాయని ఏసీపీలు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని ద్వారకా జోన్ సీఐ రమేష్ కోరారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతంపేట, బాలయ్యశాస్త్రి లేఅవుట్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఆశీలమెట్ట, ద్వారకానగర్, అక్కయ్యపాలెం, 80 ఫీట్ రోడ్డు, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో స్పెషల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. 150 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. జోన్–2 క్రైం శ్యామలరావు, ద్వారకా, ఫోర్త్‌టౌన్ సీఐలు ఎస్.రమేష్, ఎస్.విజయకుమార్, వెస్ట్ క్రైం సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైం సీఐ–2, ఎస్ఐలు 4, సిబ్బంది 300 మంది, రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, గ్యాస్, క్యూఆర్‌టీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది పహారా ఉంటారని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లను సోమవారం పోలీస్ కమిషనర్ రవిశంకర్ సందర్శించారు. వాటి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

ఎక్కడికక్కడ బందోబస్తు



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

మద్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు పగడ్బందీగా నిర్వహించామని, విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని క్రైం డీసీపీ వెంకటరత్నం సూచించారు. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బందితో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజున బందోబస్తు విధులు సక్రమంగా నిర్వర్తించాలని, ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడికక్కడ పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించే వ్యక్తులు, రాజకీయ నాయకుల నివాసాల వద్ద మొత్తం 300 మంది పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై అనుక్షణం నిఘా ఉంచాలని సిబ్బందికి క్రైం డీసీపీ ఆదేశించారు. సమావేశాన్ని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షించారు. సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న తైనాల విజయ్‌కుమార్ దంపతులు



కార్పొరేటర్ కంపా హనోకును సత్కరిస్తున్న ఉమా రామలింగేశ్వరాలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి రామచంద్రనగర్‌లోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ శాశ్వత ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ దంపతులు, భక్తులు, పేరంటాళ్ల సమక్షంలో వేదపండితుల శాస్త్రోక్త ఆశీర్వచనాలతో కల్యాణం నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పైడి నాగరాజు, ముప్పిడి రామారావు, గణపతి లక్ష్మణరావు, రమణ, పార్టీ నాయకులు హరి పట్నాయక్, రాజు యాదవ్, నాని బాబు, దుర్గ, సన్ని, పైడి శ్రీను, కత్తుల ప్రభాకరరావు, హరికృష్ణ, ఆదిలక్ష్మి, సువర్ణ, తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

5న హాజరు కావాలి

ఉక్కు యాజమాన్యానికి ఆర్‌ఎల్‌సీ ఆదేశం

అగనంపూడి: ఉక్కు కార్మికుడు నాత్ర తాతారావుతో 29 ఏళ్లు పనిచేయించుకుని, వచ్చిన జీతంలో నిబంధనల మేరకు పీఎఫ్ కోత విధించినా నెలవారి పింఛన్ చెల్లింపులో ఉక్కు యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తున్న తీరుపై రీజనల్ లేబర్ కమిషనర్ ఈ నెల 5న హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆదేశించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన తరువాత జాతీయ భద్రతా పెన్షన్ పథకంలో కనీస పింఛన్ చెల్లించాలి. ఈ విషయంలో ఉక్కు అధికారులు, ఈపీఎఫ్ అధికారుల ద్వంద్వ వైఖరిపై తాతారావు ఆర్‌ఎల్‌సీకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన 5న హాజరు కావాలని ఆదేశించారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు.

కృష్ణారావు మాస్టారు సేవలు మరువలేనివి



పైడి కృష్ణారావు మాస్టారుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్రిపాలెం: ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు సంతాప సభ నిర్వహించారు. 50వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వావిలపల్లి ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణారావు మాస్టారు ఉద్యోగ విరమణ తర్వాత పార్టీలో చేరి కీలకమైన వ్యక్తిగా పనిచేసి, వార్డు స్థాయి నుంచి నియోజకవర్గం వరకు అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. కృష్ణారావు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఏఎస్ నాయుడు, పొన్నాడ అప్పారావు, సనపల రాంగోపాల్, పార్టీ 50వ వార్డు నాయకులు పప్పల సునీత, ఎ.వి.ఎస్.రాజు, రాజంరాజు, విశ్వనాథరాజు, అమర్‌రెడ్డి, ఎం.వి.రెడ్డి, సనపల నారాయణ స్వామి, రమేష్, నంబాల ఈశ్వరరావు, ప్రసూన రెడ్డి, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, సీపాన రాము తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పిచ్చి మొక్కలు



జగన్నాథపురంలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, సంచరిస్తున్న పాము(సర్కిల్‌లో)

- పాముల సంచారంతో జగన్నాథపురం వాసుల్లో కలవరం
- అధికారులు చర్యలు చేపట్టాలని వినతి

సీతంపేట: ఖాళీ స్థలాల్లో చెట్లు, తుప్పలు పెరిగిపోయి విషసర్పాలకు నిలయంగా మారడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 43వ వార్డు జగన్నాథపురం సచివాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు సంచరిస్తూ స్థానికుల కంటపడి కలవరపెడుతున్నాయి. ఇంటి స్థలానికి చెందిన యజమాని విదేశాల్లో ఉండటంతో స్థలం నిర్వహణపై ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయి. కనీసం పారిశుధ్య సిబ్బంది కూడా పట్టించుకోవపోవడంతో తుప్పలు పెరిగి ఆ స్థలం విషసర్పాలకు నిలయమైంది.

ఇటీవల కురిసిన వర్షాలకు ఆ స్థలంలో పాములు సంచరిస్తున్నట్టు స్థానికుల కంటపడ్డాయి. వేసవి కాలం కావడంతో కిటికీలు తెరిచే పడుకుంటున్నామని, ఇళ్లల్లోకి పాములు చొరబడితే తమ పరిస్థితి ఏంటని, పిల్లలు అక్కడే ఆడుకుంటుంటారని, ఎవరైనా వాటి బారినపడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలానికి ఎదురుగా సచివాలయం ఉన్నప్పటికీ, అక్కడే విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సెక్రటరీ కూడా సమస్యపై దృష్టి సారించలేదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పర్యావరణహితంగా జీవిద్దాం



పర్యావరణ పరిరక్షణపై వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాలభాను విద్యాలయంలో నగరంలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకో వైజాగ్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పూర్తి అవగాహన పెంచుకుని తమ తోటివారితోపాటు తల్లిదండ్రులకు దీని ప్రాధాన్యాన్ని తెలియజేయాలని కోరారు.

150 మంది విద్యార్థుల హాజరు

చిత్రలేఖనం పోటీల్లో 51 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శబ్ద, వాయు, జల కాలుష్యాల నివారణకు పౌరులు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరిస్తూ చిత్రాలు వేశారు. చిత్ర కళాకారుడు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ డబ్బీరు ఉదయ భాస్కరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ జనరల్ నాలెడ్జ్, పెద్ద బాలశిక్ష పుస్తకాలను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి సునీల్‌రెడ్డి, సత్తి లలితా రెడ్డి పంపిణీ చేశారు.

కూరగాయలు, ఆకుకూరల విత్తనాల పంపిణీ

విశిష్ట అతిథి గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించి విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎకో వైజాగ్‌లో భాగంగా కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో బాలభాను విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, యూనివర్సల్ యూత్ వాకర్స్ అధ్యక్షుడు సిహెచ్.వంశీకృష్ణ వర్మ, మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, వైస్ ప్రెసిడెంట్ టి.లీలా నాయుడు, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, సంయుక్త కార్యదర్శి ఎ.రాధ, సుభాషిణి, మురళీనగర్ గార్డెనింగ్ గ్రూప్ ప్రతినిధి ఎ.అరుణ, సి.శైలజ పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

మద్దిలపాలెం: మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రేరణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందన్నారు. దోమలు వృద్ధి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వై.వి.రత్నం, ఆరోగ్య కార్యకర్తలు పాతకోకిల శేషుబాబు, మళ్ల రామునాయుడు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. లక్ష్మీకాంత్ నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రెయిన్లలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో శుభ్రం చేసిన డ్రెయిన్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులోని డ్రెయిన్లలో చెత్త తొలగించారు. ఓ రోడ్డులో మురుగు నీరు ప్రవహించడంతో స్థానికుల ఇబ్బందులపై 'రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు శానిటేషన్ సిబ్బంది భూషణ్ స్పందించారు. మురుగు రోడ్డెక్కడానికి కారణమైన డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బంది తక్షణం తొలగించి శుభ్రం చేశారు. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.